సాక్షి
మెదక్
మంగళవారం । 3 । జూన్ । 2025

మంజూరు పత్రాలు అందుకున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో..



ప్రగతి పరుగులు..

- సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు
- అవతరణ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు

మెదక్ కలెక్టరేట్: తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం తెలంగాణ రైజింగ్–2047 విజన్‌తో ముందుకు సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు అన్నారు. రాష్ట్ర 12వ అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి, ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలను సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల నీతి ఆయోగ్ సమావేశంలో ప్రకటించారని తెలిపారు. ఈ విజన్ డాక్యుమెంట్ భవిష్యత్ తెలంగాణకు భగవద్గీత లాంటిదని, ఇది రాష్ట్ర రూపురేఖలను మార్చేస్తుందని చెప్పారు. ఈసందర్భంగా జిల్లాలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాల తీరును వివరించారు. ఆయన మాటల్లోనే..



సంక్షేమ పథకాలకు పెద్దపీట

మహాలక్ష్మి (ఉచిత బస్సు సౌకర్యం) పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు మహిళలకు రూ. 69 కోట్ల లబ్ధి చేకూరింది. మహిళలంతా కలిసి 2. 38 కోట్ల ప్రయాణాలు ఉచితంగా చేశారు. గృహజ్యోతి కింద జిల్లాలో ఇప్పటివరకు 1,29,500 మంది వినియోగదారులకు జీరో బిల్లులు జారీ చేశాం. రూ. 54 కోట్ల 24 లక్షల సబ్సిడీని ప్రభుత్వం డిస్కంలకు చెల్లించింది. సబ్సిడీ గ్యాస్ పథకం ద్వారా జిల్లాలో 1,26,658 వినియోగదారులకు 4,68,195 గ్యాస్ సిలిండర్లు సబ్సిడీపై అందుకున్నారు. వీరికి రూ. 13.18 కోట్ల మేర లబ్ధి జరిగింది. రైతు రుణమాఫీ పథకం ద్వారా 87,491 మంది రైతన్నలకు రూ. 645 కోట్లు రుణమాఫీ జరిగింది. రైతు భరోసా పథకం కింద మొత్తం 2,26,970 మంది రైతుల ఖాతాల్లో రూ.140, 70 కోట్లు జమయ్యాయి. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు పరిహారం, భూమి లేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందుతోంది. అలాగే నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. నిర్మాణ దశలను బట్టి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు అందజేస్తున్నాం. గిరిజనుల భూములకు సాగునీరు, విద్యుత్ సౌకర్యం అందుతోంది. అలాగే జిల్లాలో ఈనెల 3 నుంచి 20వ తేదీ వరకు ప్రతి రెవెన్యూ గ్రామంలో సదస్సులు నిర్వహించి రైతుల సమస్యలు పరిష్కరిస్తామని వివరించారు.



14,796 మందికి ఆపరేషన్లు

జిల్లాలో ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కాలేజీ మంజూరు చేసి తరగతులు ప్రారంభించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా జిల్లాలో 14,796 మంది పేదలు చికిత్సలు పొందగా, ఇందుకు గాను ప్రభుత్వం రూ. 38.04 కోట్లు ఖర్చు చేసింది.

13 వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జిల్లాలో 2,16,716 కుటుంబాలకు రేషన్ దుకాణాల ద్వారా ఇప్పటి వరకు 13,922 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేశాం. జిల్లాకు 3,800 కొత్త రేషన్ కార్డులు మంజురయ్యాయి. యాసంగిలో కొనుగోలు కేంద్రాల ద్వారా 2,95,703 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 70,815 మంది రైతుల నుంచి కొనుగోలు చేసి, వారి ఖాతాల్లో రూ. 573.60 కోట్లు జమ చేశాం.

రూ. 5 కోట్లతో బడుల నిర్వహణ

ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా 96.87 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 12వ స్థానంలో నిలవడం అభినందనీయం. జిల్లాలోని 904 పాఠశాలల నిర్వహణకు సుమారు రూ. 5 కోట్లు ఖర్చు కేటాయించాం. సంక్షేమ హాస్టళ్లలో డైట్ చార్జీల కింద ప్రభుత్వం 40 శాతం, కాస్మోటిక్ చార్జీలు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సమీకృత గురుకులాన్ని రూ. 200 కోట్లతో నిర్మించనున్నాం.

34 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

జిల్లాలో వన మహోత్సవం ద్వారా 34 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా నిర్ణయించాం. శాంతి భద్రతల పరిరక్షణ, మత్తు పదార్థాలు, సైబర్ నేరాల నియంత్రణకు కృషి చేస్తున్న పోలీస్ యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, హౌసింగ్ పీడీ మాణిక్యం ,జిల్లా వ్యవసాయ అధికారి వినయ్‌తో కలిసి రైతులకు, విత్తనాలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కేశవరావు, కలెక్టర్ రాహుల్‌రాజ్ ఇతర అధికారులు

న్యూస్‌రీల్

శాంతియుతంగా పండగలు జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

తూప్రాన్: కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో పండగలు జరుపుకోవాలని డీఎస్పీ నరేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని లింగారెడ్డి గార్డెన్‌లో తూప్రాన్ పోలీస్ సర్కిల్ పరిధిలోని శివ్వంపేట, మనోహరాబాద్, వెల్దుర్తి, తూప్రాన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రముఖులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని మతాలకు చెందిన పండగలను గౌరవించాలని సూచించారు. సోదరభావంతో కులమతాలకు అతీతంగా కలిసి మెలిసి ఉండాలని తెలిపారు. అలాగే సోషల్ మీడియాలో వచ్చే విషయాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐలు, ప్రజలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో మిల్లెట్ క్యాంటీన్



మెదక్ కలెక్టరేట్: కలెక్టరేట్‌లో సోమవారం ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో మిల్లెట్ క్యాంటీన్ ఏర్పాటు చేశారు. 12 రకాల మిల్లెట్లతో ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఉలవలు, జొన్నలు, రాగుల, అవస, ఇప్ప పువ్వు లడ్డులు, మునగాకు పౌడర్, కొర్రలు, అవసగింజలు, జొన్న ఉప్మా, ఊదలతో పొంగలి తదితర ఆహార పదార్థాలు లభించనున్నాయి. కేవలం రూ. 50కే ప్లేట్ విక్రయిస్తున్నట్లు ప్రతి సోమవారం క్యాంటీన్ ఉంటుందని పెద్దశంకరంపేట మండలానికి చెందిన ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు అనిత తెలిపారు.

అమరవీరులకు నివాళి



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న పద్మారెడ్డి తదితరులు

చిన్నశంకరంపేట(మెదక్): రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి నివాళులర్పించారు. ఈసందర్భంగా అమరుల త్యాగాలను కొనియాడారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్ ఉన్నారు. అలాగే కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాన సత్యనారాయణ, మాజీ ఎంపీపీ అరుణ, శ్రీమన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, శివకుమార్ తదితరులు నివాళులర్పించారు.

హామీలు అమలు చేయాలి

పాపన్నపేట(మెదక్): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని టీజీ సీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంగ నర్సింలు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే పీఆర్సీ ఇస్తామని, పెండింగ్ డీఏలు విడుదల చేస్తామని, హెల్త్‌కార్డులు ఇస్తామని ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయడంతో పాటు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. లేకుంటే ఉద్యమాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు.

లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి

సదాశివపేట(సంగారెడ్డి): ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని ప్రభుత్వం తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని పద్మశాలి సేవా సంఘం డిమాండ్ చేసింది. సోమవారం సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సరస్వతికి వినతి పత్రం అందజేశారు. మలిదశ పోరాటానికి లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తి ప్రదాత అని సంఘం అధ్యక్షులు మేకల జనార్దన్, గౌరవ అధ్యక్షుడు విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి మల్లేశం కొనియాడారు. రాష్ట్ర సాధన కోసం రాజీలేని పోరాటం చేశారని, అందుకే ఆయనకు జాతిపిత ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చింత చంద్రశేఖర్, కోట రవీందర్, ఆనంద్‌కుమార్, వెంకటేశం, రవి పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు

- నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటాం: మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పార్టీలో కష్టపడిన వారిని గుర్తిస్తూ త్వరలోనే నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అంతకు ముందు రంగధాంపల్లి అమరవీరుల స్తూపం వద్ద కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరు కూడా అధైర్యపడవద్దని మీకు అండగా ఎప్పటికీ అందుబాటులో ఉంటామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హరికృష్ణ, అత్తు ఇమామ్, లక్ష్మి, బొమ్మల యాదగిరి, కలీమొద్దిన్, ఎల్లం యాదవ్, ఆనంద్, గోపీకృష్ణ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఘనంగా ఆవిర్భావ వేడుకలు



జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న అదనపు ఎస్పీ మహేందర్



మున్సిపల్ కార్యాలయంలో వంద రోజుల యాక్షన్ ప్లాన్‌పై ప్రతిజ్ఞ

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అవతరణ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అదనపు ఎస్పీ మహేందర్ జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. పోలీస్ సిబ్బంది క్రమశిక్షణతో మరింత బాధ్యతగా పనిచేసి, రాష్ట్ర, జాతీయస్థాయిలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మెదక్ మున్సిపల్ కార్యాలయంలో అదనపు కలెక్టర్, ప్రత్యేక అధికారి నగేష్ జెండావిష్కరణ చేశారు. ఈసందర్భంగా పారిశుద్ధ్యంపై వంద రోజుల యాక్షన్ ప్లాన్‌పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయ ఆవరణలో మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బట్టి జగపతి, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన

- ఆవిర్భావ వేడుకలను అడ్డుకున్న గ్రామస్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని హస్తాల్‌పూర్‌లో తాగునీటి కోసం గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జెండా ఎగురవేయడానికి ప్రయత్నించగా, మూకుమ్మడిగా అడ్డుకున్నారు. జెండా గద్దె చుట్టూ ఖాళీ బిందెలు పెట్టి అధికారులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. వారం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయినా, పట్టించుకునే నాథుడు కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా, తమ గ్రామానికి చుక్క నీరు సరఫరా చేయలేదని ఆరోపించారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు జెండా ఎగురవేసేది లేదంటూ భీష్మించుకుకూర్చున్నారు. హల్దీ వాగులోని బోరు మోటార్ చెడిపోయి రోజులు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టడానికి సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహించారు. పోలీసులు నచ్చజెప్పినా స్పందించలేదు. చివరికి కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు అక్కడికి చేరుకొని 24 గంటల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించి ఆందోళన విరమించారు. దీంతో రెండున్నర గంటలు ఆలస్యంగా సుమారు 11 గంటల ప్రాంతంలో పంచాయతీ కార్యదర్శి జెండా ఎగురవేశారు.



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

నేటి నుంచి ఊరూరా ‘భూ భారతి’

- 392 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు
- కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్/కొల్చారం: పటిష్ట ప్రణాళికతో మంగళవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు జిల్లాలో భూ భారతి రెవెన్యూ సదస్సులు ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టర్‌లో మాట్లాడుతూ.. ఇటీవల జిల్లాలోని చిలప్‌చెడ్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసుకొని మండలంలోని 16 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మొత్తం 1,045 దరఖాస్తులు వచ్చాయని, వాటిని కేటగిరిల వారీగా విభజించి పరిష్కార చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇందులో 250 దరఖాస్తులు డిస్పోజ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా 392 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, వాటిలో దశలవారీగా సదస్సులు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తులను ఎటువంటి రుసుము లేకుండా పూర్తిగా ఉచితంగా అందజేస్తామన్నారు. సమస్యల పరిష్కార నిమిత్తం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ఆరుగురు అధికారుల బృందం పాల్గొంటుందని వెల్లడించారు. అనంతరం హౌసింగ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్‌ఓ భుజంగరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం, డీఎంహెచ్‌ఓ శ్రీరామ్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే కొల్చారం మండలంలోని కోనాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. వాతావరణంలో నెలకొన్న మార్పుల దృష్ట్యా కొనుగోళ్లు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి, రైతులకు సూచించారు.



ధాన్యంలో తేమ శాతం పరిశీలిస్తున్న కలెక్టర్

మల్లన్న సాగర్‌ను సందర్శించిన ఏసీపీ

తొగుట(దుబ్బాక): మండలంలోని కొమురవెల్లి మల్లన్న సాగర్‌ను గజ్వేల్ ఏసీపీ నర్సింహులు సోమవారం సందర్శించారు. పంప్‌హౌస్, రిజర్వాయర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ నిర్మాణం, సాగునీరు, తాగునీటి వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని డీఈ చెన్ను శ్రీనివాస్ ఏసీపీకి వివరించారు. అంతకు ముందు లింగాపూర్ శివారు లోని వైష్ణవి కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించిన ఎక్స్‌ప్లోజివ్ (డిటోనేటర్లు భద్రపరిచే) గోదాంను ఏసీపీ పరిశీలించారు. గోదాంకు సంబంధించిన అనుమతి పత్రాలు, స్టాక్ రికార్డులను ఆయన పరిశీలించారు. గోదాములో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. గోదాం వద్ద సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని ఏసీపీ సూచించారు.



పంప్‌హౌస్‌లో ఏసీపీకి వివరిస్తున్న డీఈ శ్రీనివాస్

భూమి కోల్పోయి.. అప్పులు పెరిగి..

సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఆటోడ్రైవర్ ఆత్మహత్యాయత్నం

శివ్వంపేట(నర్సాపూర్): సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శివ్వంపేట మండలం కొత్తపేటలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. కొత్తపేట గ్రామానికి చెందిన కంచన్‌పల్లి శేఖర్ ఉపాధి కోసం పట్నం వెళ్లి సూరారం, బాచుపల్లిలో ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఫ్రీ బస్ వల్ల ఆటో గిరాకీ లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. సుమారు రూ. 20 లక్షల వరకు అప్పులు అయ్యాయి. ట్రిపుల్‌ఆర్‌లో 20 గుంటల భూమి కోల్పోగా ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వలేదు. ఇటు ఆటో నడవక, అటు కోల్పోయిన భూమికి నష్టపరిహారం రాక అప్పులు తీర్చే మార్గం లేకుండా పోయింది. దీనికితోడు మూడు ఎకరాల సీలింగ్ భూమి ఇతరులు కబ్జా చేశారు. పలుమార్లు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. కేసీఆర్ సార్ మంచోడని కేసీఆర్ తనను ఆదుకోవాలని కోరాడు. సీఎం రేవంత్‌రెడ్డితో ఏమి కాదన్నాడు. అప్పు తీర్చే మార్గం లేక పురుగుల మందు తాగుతూ ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో తీసి గ్రూపులలో షేర్ చేశారు. ఇది చూసిన గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితుడిని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్త సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఆత్మహత్యాయత్నం చేయడం ఇది రెండోసారని తెలిసింది.



పురుగు మందు డబ్బాతో శేఖర్

గుమ్మడిదల రైతులకు బాసట

జిన్నారం (పటాన్‌చెరు): సర్వే నంబర్ 109 భూ బాధితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటానని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ నేత గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బాధిత రైతులతో కలసి సోమవారం నగరంలో హరీశ్‌రావును కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌కు ఫోన్ చేసి రైతుల గోడును వినిపించారు. తమ ప్రభుత్వ హయాంలో ఒక్కో రైతుకు 600 గజాల భూమిని ఇవ్వాలని నిర్ణయించామని, దాని విలువ సుమారు రూ.60 లక్షలు ఉందని, ప్రస్తుత విలువ రెండు కోట్లు ఉంటుందని తెలిపారు. లగచర్ల రైతులకు పరిహారం, ఉద్యోగాలు ఇచ్చినట్లు గుమ్మడిదల రైతులకు కూడా న్యాయం జరగాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

మెలకువలు.. మెరుగులు

- 6న ముగియనున్న వేసవి శిక్షణ
- అథ్లెటిక్స్ పోటీలకు సన్నద్ధం

చేగుంట(తూప్రాన్): అథ్లెటిక్స్ పోటీలకు నిష్ణాతులుగా తయారు చేసేందుకు ప్రభుత్వం యూత్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో బాల బాలికలకు వేసవి శిక్షణ ఇస్తుంది. జిల్లాలో కేవలం చేగుంటలో మాత్రమే శిబిరం ఏర్పాటు చేశారు. మేలో ప్రారంభించిన శిక్షణ ఈనెల 6వ తేదీతో ముగియనుంది. అథ్లెటిక్స్ శిక్షణలో భాగంగా 6 నుంచి 14 సంవత్సరాల వయసు గల బాల, బాలికలలకు అవకాశం కల్పించారు. రన్నింగ్, షార్ట్‌పుట్, లాంగ్‌జంప్, డిస్కస్ త్రో, జావెలింగ్ త్రో వంటి వాటిలో మెలకువలతో పాటు శారీరక దృఢత్వం కోసం వ్యాయామం చేయిస్తున్నారు. వీటితో పాటు జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ సౌజన్యంతో రగ్బీ క్రీడకు సంబంధించిన శిక్షణ సైతం అందిస్తున్నారు. మండల కేంద్రమైన చేగుంటలోని స్టేడియంలో ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రెండున్నర గంటల పాటు శిక్షణ నిర్వహిస్తున్నారు. వేసవి సెలవుల్లో బాల బాలికలకు శిక్షణ ఉపయోగరంగా మారింది. చేగుంట, వడియారం, రెడ్డిపల్లి, చిట్టోజిపల్లి గ్రామాల బాల బాలికలను తల్లిదండ్రులు శిబిరానికి పంపుతున్నారు. వీరితో పాటు సెలవుల్లో భాగంగా చేగుంటలోని బంధువుల ఇళ్లకు వచ్చిన వివిధ జిల్లాలకు చెందిన చిన్నారులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ఇక్కడ మెలకువలు నేర్చుకున్న వారు జిల్లా నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారు.



శిక్షణ పొందుతున్న బాల బాలికలు

క్లుప్తంగా

జేఈఈ అడ్వాన్స్‌డ్‌ ఫలితాల్లో మెరిసిన గిరిపుత్రులు


బీ. సునీల్‌


ఎల్‌. ప్రవీణ్‌

హుస్నాబాద్‌రూరల్‌: జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్ష ఫలితాల్లో హుస్నాబాద్‌ మండలం జిల్లెలగడ్డలోని గిరిజన గురుకుల కళాశాల విద్యార్థులు మెరిశారు. సోమవారం ప్రకటించిన ఈ ఫలితాల్లో ఆల్‌ ఇండియా ఎస్టీ కేటగిరిలో బీ. సునీల్‌ 572 ర్యాంకు, ఎల్‌. ప్రవీణ్‌ 1,750 ర్యాంకు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ రాజు తెలిపారు.

మొగుడంపల్లి విద్యార్థి ప్రతిభ

జహీరాబాద్‌ టౌన్‌: జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్షలో మండల కేంద్రమైన మొగుడంపల్లి విద్యార్థి తుడుం స్టాలిన్‌ ప్రతిభ కనబర్చాడు. ఆల్‌ ఇండియా ర్యాంకింగ్‌లో 8,589 స్థానం సాధించగా జాతీయ స్థాయిలో ఎస్సీ కేటగిరీలో 205 ర్యాంక్‌ సాధించాడు. జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించడంతో తండ్రి సిరోమణి హర్షం వ్యక్తం చేశారు.


తుడుం స్టాలిన్‌

నాడు అనారోగ్యంతో తల్లి.. నేడు తండ్రి

- ఇద్దరి మృతితో అనాథలుగా మారిన పిల్లలు


అనాథలైన చిన్నారులు

గజ్వేల్‌రూరల్‌: ఏడాది కిందట తల్లి, నేడు తండ్రి మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. ఈ విషాదకర ఘటన గజ్వేల్‌ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీ(పల్లెపహాడ్‌)లో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మల్లన్నసాగర్‌ ముంపు గ్రామమైన పల్లెపహాడ్‌కు చెందిన గూడూరి రమేశ్‌(40), పద్మ దంపతులకు 9 ఏళ్ల లోపు ఇద్దరు కుమారులు పవన్‌, వరుణ్‌లు ఉన్నారు. వీరి గ్రామం మల్లన్నసాగర్‌ ప్రాజెక్టులో ముంపునకు గురికావడంతో ప్రభుత్వం తాత్కాలికంగా కేటాయించిన డబుల్‌ బెడ్‌రూమ్‌లలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నారు. ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలో ఓపెన్‌ప్లాట్‌ను తీసుకొని ప్రభుత్వం ఇచ్చిన రూ. 5 లక్షల పరిహారంతో ఇంటి నిర్మాణం చేయాలనుకున్నారు. ఏడాది కిందట పద్మకు గుండెపోటు రావడంతో భర్త రమేశ్‌ ఆ రూ. 5 లక్షలతోపాటు మరికొంత డబ్బుతో వైద్యం చేయించినప్పటికీ మృతి చెందింది. భార్య మృతితో మానసికవేదనకు గురైన రమేశ్‌ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. తల్లిదండ్రులు ఇద్దరూ మృతి చెందడంతో ఆ చిన్నారులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు చందాలు వేసుకొని సోమవారం రమేశ్‌ అంత్యక్రియలను నిర్వహించారు. దాతలు ఎవరైనా ఉంటే పిల్లలను ఆదుకోవాలని 95029 56642 నంబరులో సంప్రదించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

భార్యను చంపిన కేసులో భర్త రిమాండ్‌


వివరాలు వెల్లడిస్తున్న సీఐ లతీఫ్‌

కొండపాక(గజ్వేల్‌): భార్యను కొట్టి చంపిన కేసులో భర్తను అరెస్టు చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. తొగుట సీఐ లతీఫ్‌ కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు వివరాలు వెల్లడించారు. కొండపాకకు చెందిన యశోదపై భర్త మల్లేశం అనుమానం పెంచుకొని గొడవపడి ఇనుప పారతో తలపై కొట్టాడు. ఆమె స్పృహ తప్పి పడిపోగా భయంతో పారిపోయాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యశోద ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. మల్లేశం అదే రోజు రాత్రి హైదరాబాద్‌కు పారిపోయేందుకు కుకునూరుపల్లి బస్టాప్‌లో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఎస్‌ఐ శ్రీనివాస్‌తోపాటు కలిసి అక్కడికి వెళ్లి నిందితుడు మల్లేశంను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. నేరం ఒప్పుకోగా రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

హాతవీధి

వీధి వ్యాపారులకు డబుల్‌ వాత

- ఇళ్లు, స్కూళ్ల ఎదుట బండి పెడితే డబ్బులు వసూలు
- ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసి అద్దెకు
- ఫుట్‌ పాత్‌లను వదలని వైనం


హైదరాబాద్‌ రోడ్‌ మార్గంలో ఫుట్‌పాత్‌ మీద వ్యాపారాలు

లక్ష్మీనర్సయ్య బతుకు దెరువు కోసం మొబైల్‌ టిఫిన్‌ సెంటర్‌ ఏర్పాటు చేసుకున్నాడు. మెదక్‌ రహదారిపై రోడ్డు పక్కన ఖాళీ ప్రాంతంలో బండి పెట్టుకున్నాడు. దాని వెనుక భాగంలో ఉన్న ఇంటి యజమాని అట్టి స్థలం తనది కానప్పటికీ, ఇంటి ముందు మొబైల్‌ వాహనం పెట్టడంతో తనకు అద్దె డబ్బులు చెల్లించాలని డిమాండ్‌ చేశాడు. తన వ్యాపారానికి మంచి అడ్డా కావడంతో చేసేది లేక ఇంటి యజమానికి ఏడాదికి కొంత అని ముట్టజెప్పాల్సి వచ్చింది. మరోవైపు అదే బండి మున్సిపల్‌ స్థలంలో పెట్టినందుకు తైబజార్‌ ఫీజు రూపంలో రోజువారీగా మున్సిపల్‌ అనుమతి పొందిన కాంట్రాక్టర్‌కు డబ్బులు ఇవ్వాల్సి వస్తుంది.. ఇది లక్ష్మీ నర్సయ్య పరిస్థితే కాదు. వందలాది వీధి వ్యాపారుల పరిస్థితి.

సిద్దిపేటజోన్‌: జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్‌, దుబ్బాక, హుస్నాబాద్‌, చేర్యాల మున్సిపాలిటీలు ఉన్నాయి. అర్బన్‌ మెప్మా రికార్డుల ప్రకారం సుమారు 12 వేలపై చిలుకు వీధి వ్యాపారులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో స్వల్పంగా రైతుబజార్‌, వివిధ మార్కెట్లలో వ్యాపారాలు సాగిస్తున్నారు. అత్యధికంగా ఆయా మున్సిపాలిటీల్లో పట్టణ ప్రధాన రహదారిపై ఇరువైపులా తోపుడు బండ్లు, వివిధ రకాల వాహనాలు, చిన్నపాటి టీ కొట్టులు ఏర్పాటు చేసుకున్నారు. ప్రతీరోజూ ఉదయం టిఫిన్‌ సెంటర్లు, సాయంత్రం పాని పూరీ, మొబైల్‌ వాహనాల, ఫాస్ట్‌ ఫుడ్‌ సెంటర్‌ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు.

యథేచ్ఛగా కబ్జా..

ఆయా మున్సిపాలిటీల్లో ఇరువైపులా రహదారులపై ప్రజల నడక కోసం ఫుట్‌పాత్‌ లను మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేశారు. ఇది కబ్జా దారులకు వరంగా మారుతుంది. సిద్దిపేట లాంటి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ స్థలాలను వీధి వ్యాపారులకు సబ్‌ లీజ్‌ ఇచ్చి డబ్బులు దండుకుంటున్నారు. ముఖ్యంగా మెదక్‌, కరీంనగర్‌, హైదరాబాద్‌ రోడ్‌ మార్గంలో ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణాల ముందు ఉన్న ఖాళీ స్థలాలను, ఫుట్‌పాత్‌లను యథేచ్ఛగా ఆక్రమించి వీధి వ్యాపారులకు అద్దెకు ఇస్తున్నారు. తమ స్థలం కానప్పటికీ అద్దె పేరిట సబ్‌ లీజ్‌ ఇస్తూ నాలుగు కాసుల ఆదాయాన్ని పొందుతున్నారు. అందుకు నిదర్శనంగా హైదరాబాద్‌ రోడ్డు హౌసింగ్‌ బోర్డ్‌ కమాన్‌ పరిసరాల్లో ఏకంగా మున్సిపల్‌కు చెందిన ఫుట్‌పాత్‌ లపై పెద్ద ఎత్తున వ్యాపారాలు సాగుతున్నాయి.

మేమేమి తక్కువ కాదన్నట్టు..

ప్రైవేటు ఇంటి యజమానులు తమ ఇంటి ఎదుట ఉన్న ఖాళీ స్థలాన్ని వీధి వ్యాపారులకు అద్దె ఇస్తుండగా, తాము ఏమి ఇందులో తక్కువ కాదన్నట్టుగా ప్రభుత్వ స్కూళ్ల వారు బడి ఎదుట స్థలాన్ని సబ్‌ లీజ్‌కు ఇచ్చిన ఘటనలు జిల్లా కేంద్రంలో కోకొల్లలుగా ఉన్నాయి. మెదక్‌ రోడ్‌, కరీంనగర్‌ మార్గంలో రహదారిపై ఉన్న ఖాళీ స్థలాల్లో మొబైల్‌ టిఫిన్‌ సెంటర్‌, పానీ పూరీ సెంటర్లు పెట్టినందుకు సంబంధిత వీధి వ్యాపారులు విద్యాశాఖకు ఏడాదికి ఇంత అని కొంత ముట్టజెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ డబ్బులను విద్యాశాఖ అభివృద్ధి పనులకు వాడినట్టు సమాచారం. మరో వైపు రోడ్డుపై వ్యాపారం చేస్తున్నందుకు వీధి వ్యాపారులు మున్సిపల్‌కు తైబజార్‌ రూపంలో డబ్బులు చెల్లించారు. ఇలా రెండు వైపులా డబ్బులు కట్టడం ఇబ్బందిగా మారిందని చిరు వ్యాపారులు మొరపెట్టుకున్నారు.

తప్పని ట్రాఫిక్‌ ఇబ్బందులు

జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా ఫుట్‌పాత్‌, రోడ్డుపై ఒక పక్క ఖాళీ స్థలాన్ని ఆక్రమించి వ్యాపారం సాగడంతో పరోక్షంగా ట్రాఫిక్‌ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయి. వాహనాల రాకపోకలకు అసౌకర్యం కలుగుతుంది. పోలీసులు జరిమానా విధించిన ఘటనలు ఉన్నాయి.

స్థలాల అద్దె సరికాదు



మున్సిపల్‌కు చెందిన ఫుట్‌పాత్‌, ఖాళీ స్థలాలను ఇతరులకు సబ్‌ లీజ్‌కు అద్దెకు ఇవ్వడం సరి కాదు. ఫుట్‌పాత్‌ అనేది కేవలం నడక కోసమే.. వాటిని వ్యాపారం కోసం వాడుకోవడం, ఇతరులకు అద్దెకు ఇచ్చే హక్కు ఎవ్వరికీ లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం.

–ఆశ్రిత్‌ కుమార్‌, మున్సిపల్‌ కమిషనర్‌

సోషల్‌ మీడియా పుకార్లు నమ్మొద్దు

సిద్దిపేట ఏసీపీ రవీందర్‌ రెడ్డి

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): సోషల్‌ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మొద్దని, ఏది నిజం, ఏది అబద్ధం తెలుసుకున్న తర్వాతే పోస్టులు పెట్టాలని సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో టూ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఫ్లాగ్‌ మార్చ్‌ నిర్వహించారు. సిద్దిపేట టూ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని సాజీత్‌ పుర, కరీంనగర్‌ రోడ్‌, అంబేడ్కర్‌ నగర్‌, సంజీవయ్య నగర్‌, తదితర ప్రాంతాల్లో శాంతి భద్రతల పరిరక్షణ గురించి ఫ్లాగ్‌ మార్చ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. పోలీసుల సలహాలు, సూచనలు పాటించి శాంతి భద్రతలో ప్రజలు, యువకులు భాగస్వామ్యం కావాలన్నారు. డయల్‌ 100, సిద్దిపేట పోలీస్‌ కంట్రోల్‌ రూమ్‌ 87126 67100కు ఫోన్‌ చేసి సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో వన్‌ టౌన్‌ సీఐ వాసుదేవరావు, టూటౌన్‌ సీఐ ఉపేందర్‌, ఎస్‌ఐలు, పోలీస్‌ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ఫ్లాగ్‌ మార్చ్‌ నిర్వహిస్తున్న పోలీసులు

వీహెచ్‌పీ కార్యదర్శిపై దాడి : కేసు నమోదు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): విశ్వహిందూ పరిషత్‌ మెదక్‌ సహ కార్యదర్శి గ్యాదరి రాజారాంపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్‌ సీఐ ఉపేందర్‌ సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఆదివారం రాత్రి సిద్దిపేట పట్టణంలోని సాజీద్‌పుర కాలనీ గుండా వెళ్తుండగా ఓ వర్గం వారు పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని కులం పేరుతో దూషిస్తూ భౌతిక దాడులు చేశారని, రాజారాం సోదరుడు గ్యాదరి గోపి ఫిర్యాదు చేశాడు. అదే విధంగా గ్యాదరి రాజారాం తమ ఇంటికి వచ్చి రాళ్లు విసిరారని ఓ వర్గానికి చెందిన మహిళ ఫిర్యాదు చేసింది. ఇరువురి ఫిర్యాదులు స్వీకరించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సిద్దిపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గ్యాదరి రాజారాంను మెదక్‌ ఎంపీ రఘునందన్‌రావు, వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి శశిధర్‌ పరామర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, సీపీ అనురాధను ఎంపీ రఘునందన్‌రావు కోరారు. రాజారాంపై భౌతిక దాడులను నిరసిస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో సిద్దిపేట బంద్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు.


రాజారాంను పరామర్శిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

కూరగాయలకు వెళ్లొస్తుండగా..

- టిప్పర్‌ను ఢీకొట్టిన బైక్‌
- కుమారుడు మృతి, తండ్రికి తీవ్ర గాయాలు

మర్కూక్‌(గజ్వేల్‌): రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి చెందగా, తండ్రికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన మర్కూక్‌ మండలంలోని పాములపర్తి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. ములుగు ఎస్‌ఐ దామోదర్‌ కథనం మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం కొండారెడ్డి చెరువు గ్రామానికి చెందిన కర్రె కనకయ్య(33), కుమారుడు కర్రె జీవన్‌ (13) ఇద్దరూ వ్యాపారం నిమిత్తం కూరగాయలు కొనుగోలు చేసేందుకు బైక్‌పై ములుగు మండలంలోని వంటిమామిడి మార్కెట్‌కు వచ్చారు. కూరగాయలు కొనుగోలు చేసుకొని తిరిగి వెళ్తుండగా మండలంలోని పాములపర్తి గ్రామ శివారులో ముందుగా వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే 108 అంబులెన్స్‌లో గజ్వేల్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే జీవన్‌ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కనకయ్యను మెరుగైన వైద్యం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.


జీవన్‌ (ఫైల్‌)

మద్యం మత్తులో బావిలో పడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని బయటకు తీస్తున్న గ్రామస్తులు

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పీర్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్‌ కథనం మేరకు.. జగదేవ్‌పూర్‌కు చెందిన రాయారం కనకయ్య(40) సుజాత దంపతులు గ్రామంలోనే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. కొద్ది రోజులుగా కనకయ్య మద్యానికి బానిస కావడంతో భార్య తల్లిగారి ఇంటికెళ్లి అక్కడే ఉంటుంది. ఆదివారం పీర్లపల్లిలో అక్క ఇంటికి వెళ్లి వస్తానని తండ్రితో చెప్పి ఆదివారం సాయంత్రం బయలుదేరాడు. పీర్లపల్లికి కాలినడకనా వెళ్లి గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన కొమురయ్య వ్యవసాయ బావి వద్ద మద్యం సేవిస్తున్నాడు. కొమురయ్య చూసి పలకరించగా అక్క వెంకటమ్మ ఇంటికొచ్చానని చెప్పారు. అనంతరం బావి దగ్గర కాలకృత్యాలు తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయాడు. వెంటనే కనకయ్య వెంకటమ్మకు సమాచారం ఇచ్చాడు. అప్పటికే రాత్రి కావడంతో సోమవారం ఉదయం బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్‌ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు


పరశురాములు(ఫైల్‌)

గజ్వేల్‌రూరల్‌: డివైడర్‌ను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన గజ్వేల్‌ పట్టణంలోని సంగాపూర్‌ మార్గంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సోమవారం పోలీసుల కథనం మేరకు.. గజ్వేల్‌ మండలం బెజుగామ గ్రామానికి చెందిన ముత్యాల పరశురాములు(32)కు భార్యతోపాటు ఇద్దరు పిల్లలున్నారు. జీవనోపాధి కోసం కొన్నేళ్ల కిందట బొంబాయికి వెళ్లారు. పిల్లల ఆధార్‌కార్డుల కోసం వారం రోజుల కిందట పరశురాములు దంపతులు గజ్వేల్‌ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీ(లక్ష్మాపూర్‌)లో ఉండే అత్తగారింటికి వచ్చారు. ఆదివారం రాత్రి ఒక్కడే బైక్‌పై గజ్వేల్‌ నుంచి లక్ష్మాపూర్‌ వైపు వస్తుండగా మార్గమధ్యలో రింగు రోడ్డు వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో పరశురాములు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌ను డీసీఎం ఢీకొట్టడంతో వ్యక్తి

గజ్వేల్‌రూరల్‌: డీసీఎం వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన గజ్వేల్‌ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మర్కూక్‌ మండలం పాతూరుకు చెందిన కొక్కండ వెంకటేశ్‌(38)కు భార్య హంస, కుమారుడు, కూతురు ఉన్నారు. కూరగాయ పంటలను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం కూరగాయలను తెంపుకొని బైక్‌పై పాతూరు కూరగాయల మార్కెట్‌కు వచ్చాడు. తిరిగి పొలానికి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలోని మహాలక్ష్మీ రబ్బర్‌ పరిశ్రమ వద్ద ఎదురుగా వచ్చిన డీసీఎం వెంకటేశ్‌ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంకటేశ్‌ను చికిత్స నిమిత్తం గజ్వేల్‌ ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్‌ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు


సూర్య (ఫైల్‌)

పాపన్నపేట(మెదక్‌): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు ఆస్పత్రిలో పొందుతూ మృతి చెందాడు. మండల పరిధిలోని పొంలా తండాకు చెందిన లునావత్‌ సూర్య(30) నార్సింగి గ్రామానికి చెందిన దుర్గయ్య బైక్‌పై 28న పాపన్నపేట వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో పెట్రోల్‌ బంకు వద్ద ముందుగా వెళ్తున్న టీవీఎస్‌ మోపెడ్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ఘనటలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. సూర్యకు బలమైన గాయాలు కావడంతో మెదక్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌ గౌడ్‌ తెలిపారు.

బాల్య వివాహం.. ముగ్గురిపై కేసు నమోదు

బాలికను బాలల సంరక్షణ కేంద్రానికి తరలింపు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్‌): బాలికకు పెళ్లి చేసినందుకు ఆమె తల్లిదండ్రులతోపాటు పెళ్లి కుమారుడిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి, ఐసీడీఎస్‌ అధికారుల కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 9వ తరగతి బాలికను వేసవి సెలవుల నేపథ్యంలో కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ ములుగు మండలానికి చెందిన వ్యక్తితో గుట్టుచప్పుడు కాకుండా తల్లిదండ్రులు పెళ్లి చేశారు. కాగా విషయం తెలియడంతో ఐసీపీఎస్‌ కోఆర్డినేటర్‌ శంకర్‌గౌడ్‌, మండల ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ సంతోష, పంచాయతీ కార్యదర్శి గాయత్రీ గ్రామంలో విచారణ చేశారు. బాల్య వివాహం చేయడం సరికాదని తల్లిదండ్రులకు చెప్పి బాలికను మెదక్‌ బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుకర్‌ రెడ్డి తెలిపారు.

గుంతలోకి దూసుకెళ్లిన బస్సు

మనోహరాబాద్‌(తూప్రాన్‌): అదుపుతప్పి బస్సు గుంతలోకి దూసుకెళ్లిన ఘటన మనోహరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని ముప్పిరెడ్డిపల్లి పరిశ్రమల వాడలోని లాంకో పరిశ్రమలో పని చేసే ఉద్యోగులు, కార్మికులను పరిశ్రమకు చెందిన బస్సులో నిత్యం ట్రాన్స్‌పోర్ట్‌ చేస్తారు. సోమవారం హైదరాబాద్‌ నుంచి సుమారు 20 మందిని బస్సులో తీసుకొని వస్తున్నారు. మండలంలోని కూచారం వద్ద జాతీయ రహదారిపై యూటర్న్‌ వద్ద వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. బస్సు డ్రైవర్‌ సాయికి తీవ్రగాయాలు కాగా, మిగితా వారికి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు.


చెట్ల పొదల్లో బోల్తా పడిన బస్సు

మా భూమిలోకి మమ్మల్ని రానివ్వడం లేదు


ఫ్ల కార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

- న్యాయం చేయాలని మంత్రికి వినతి
- ఫ్ల కార్డులతో బాధితుల నిరసన

సిద్దిపేటజోన్‌: డబ్బులు పెట్టి కొన్న మా భూమిలోకి రానివ్వడం లేదని, తమకు న్యాయం చేయాలని బాధితులు ఫ్ల కార్డులతో నిరసన వ్యక్తం చేసిన ఘటన సోమవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుక వద్ద చోటు చేసుకుంది. బాధితులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి న్యాయం చేయాలని అభ్యర్థించారు. బాధితుల కథనం ప్రకారం.. రాఘవేంద్రనగర్‌ పరిధిలో 1996లో 21 మంది ప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. 2023లో అశోక్‌, మహేందర్‌ ఆ భూమిని వ్యవసాయ భూమిగా మార్చుకున్నారని ఆరోపించారు. కొద్ది రోజులుగా అక్కడికి రాకుండా అడ్డుకోవడం, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని నిరసన వ్యక్తం చేశారు.

ఎదుగుదల ఓర్వలేక కుట్ర..

రాజకీయ ఎదుగుదల ఓర్వలేక తనపై కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్‌ నాయకుడు మహేందర్‌ విమర్శించారు. సోమవారం ప్రెస్‌ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ వెంచర్‌లో ప్లాట్లు కొని కొందరు తనపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. సర్వే నంబర్‌ 2000లో రికార్డుల ప్రకారం 4 ఎకరాల్లో కాకుండా 18 ఎకరాలు ఉన్నట్లు తప్పుడు పత్రాలతో రియల్‌ వ్యాపారులు కబ్జా చేసినట్లు ఆరోపించారు. తనపై ఆరోపణలు చేసి ఫ్ల కార్డులతో నిరసన చేసిన వారిపై పోలీసు స్టేషన్‌ లో ఫిర్యాదు చేయనున్నట్టు పేర్కొన్నారు.

మానవత్వం చాటిన ఆర్టీసీ ఉద్యోగులు


బ్యాగును అప్పగిస్తున్న ఎస్‌ఐ, ఆర్టీసీ ఉద్యోగులు

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): బంగారు ఆభరణాలు, నగదును బస్సులో మర్చిపోయిన వ్యక్తికి ఆర్టీసీ ఉద్యోగులు అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన బంటు యాదగిరి కూతురు పెళ్లికి సంబంధించి ఏడు తులాల బంగారం, రూ.2.5 లక్షల నగదును బ్యాగులో పెట్టుకొని సోమవారం గజ్వేల్‌ ప్రజ్ఞాపూర్‌ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో భువనగిరి నుంచి యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం ఇంద్రానగర్‌కు బయలుదేరాడు. ఇంద్రానగర్‌ వెళ్లే ఆటో ఎక్కడానికి జగదేవ్‌పూర్‌ రాగానే బ్యాగును బస్సులోనే వదిలి హడావిడిగా దిగిపోయాడు. ఆ బ్యాగును గమనించిన డ్రైవర్‌ సలీం, కండక్టర్‌ ఓం ప్రకాశ్‌ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కొద్దిసేపటికి యాదగిరి జగదేవ్‌పూర్‌కు వచ్చి పోలీస్‌స్టేషన్‌కు విషయాన్ని చెప్పాడు. ఎస్‌ఐ చంద్రమోహన్‌ బంగారం, నగదు బ్యాగును బాధితుడికి అప్పగించారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ

సిద్దిపేటజోన్‌: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌ పోటీల్లో సిద్దిపేట జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. సికింద్రాబాద్‌ జింఖానా గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి సబ్‌ జూనియర్‌ అథ్లెటిక్స్‌ పోటీల్లో జితేష్‌, ఇమ్రాన్‌ గోవింద్‌, ఆదిత్య వివిధ విభాగాల్లో ఐదు పతకాలు సాధించారు .ఈ సందర్భంగా వారిని జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు పరమేశ్వర్‌, ప్రధాన కార్యదర్శి వెంకట్‌ స్వామి అభినందించారు.


పతకాలతో క్రీడాకారులు

రాయపోల్‌లో దొంగల బీభత్సం

ఒకే రోజు రెండు ఇళ్లలో చోరీ

దుబ్బాకటౌన్‌ : తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని రాయపోల్‌ మండలం కొత్తపల్లి గ్రామంలో దొంగలు రెచ్చిపోయారు. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన చాకలి భిక్షపతి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న నాలుగున్నర తులాల వెండి, గ్రాము చేతి ఉంగరాలు, రూ.17,500 నగదును దోచుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన ఎరోళ్ల మల్లయ్య ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.8 వేల విలువ గల 18 తులాల వెండి, రూ.56 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితులిద్దరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రఘుపతి తెలిపారు.

బస్సులో బంగారం అపహరణ

నర్సాపూర్‌ : బస్సులో ప్రయాణికురాలి బ్యాగులో నుంచి బంగారు నగలు చోరీకి గురయ్యాయి. ఎస్‌ఐ లింగం కథనం మేరకు.. బోయిన్‌పల్లికి చెందిన మాధవి ఇద్దరు కూతుర్లతో కలిసి ఆదివారం తూప్రాన్‌లో బంధువుల ఫంక్షన్‌కు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో నర్సాపూర్‌ మీదుగా వెళ్లేందుకు సాయంత్రం స్థానిక బస్టాండ్‌కు వచ్చింది. కూతురు అమృత మెడలోని బంగారు చైన్‌ తీసి తల్లికి ఇవ్వగా బ్యాగులో భద్రపరిచింది. అప్పటికే బ్యాగులోని పర్సులో బంగారు నెక్లెస్‌ ఉండగా మొత్తం ఐదు తులాల వరకు ఉన్నాయి. అనంతరం తల్లీకూతుర్లు కలిసి బాలానగర్‌ వెళ్లే బస్సు ఎక్కారు. నర్సాపూర్‌ పట్టణ శివారులోని మల్లన్న గుడి సమీపంలోకి వెళ్లిన తర్వాత బ్యాగులో పరిశీలించగా నగల పర్సు కన్పించలేదు. అప్పటికే చీకటి పడటంతో ఆమె ఇంటికి వెళ్లిపోయింది. సోమవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘మహీంద్ర’లో పోరు రసవత్తరం

- 4వ వరుస విజయం కోసం సీఐటీయూ వ్యూహం
- పూర్వ వైభవం కోసం ఐఎన్‌టీయూసీ కసరత్తు
- కార్మిక సంఘం ఎన్నికలకు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆయా యూనియన్ల నాయకులు

జహీరాబాద్‌: జహీరాబాద్‌లోని మహీంద్ర అండ్‌ మహీంద్ర కర్మాగారంలో కార్మిక సంఘం ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. 5న ఎన్నికలను నిర్వహించేందుకు కార్మిక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల్లో అధికార సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ యూనియన్లు విజయం కోసం శత విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నాయి. గత ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికలను ఆయా యూనియన్లు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. 1983–84 సంవత్సరంలో 150 మంది పర్మనెంట్‌ కార్మికులతో ప్రారంభమైన కర్మాగారంలో ప్రస్తుతం 543 మంది కార్మికులు ఉన్నారు. 1985 నుంచి కార్మిక సంఘం ఎన్నికలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ ఆరు పర్యాయాలు, సీఐటీయూ ఆరు పర్యాయాలు, హెచ్‌ఎంఎస్‌ రెండు పర్యాయాలు, టీఎంఎస్‌ రెండు పర్యాయాలు విజయం సాధించాయి.

ఇప్పటికే గేట్‌ మీటింగ్‌లు పూర్తి

కార్మిక సంఘం ఎన్నికల్లో పోటీ పడుతున్న సీఐటీయూ, ఐఎన్‌టీయూసీలు ఇప్పటికే గేట్‌ మీటింగ్‌లను నిర్వహించి గెలిపిస్తే తాము చేయబోయే ప్రధాన పనుల గురించి కార్మికులకు సందేశం ఇచ్చారు. ఇప్పటి వరకు తాము మంచి అగ్రిమెంట్‌ చేసి పెట్టామని సీఐటీయూ నేత చుక్క రాములు చెబుతున్నారు. ఐఎన్‌టీయూసీ తరఫున పోటీ చేస్తున్న రాష్ట్ర నేత జనక్‌ప్రసాద్‌ మాత్రం రాష్ట్రంలో తమ యూనియన్‌ అధికారంలో ఉన్నందున కార్మికుల సమస్యలను పరిష్కరించడం సులభవుతుందంటున్నారు. ఆయా యూనియన్‌ నాయకులు కార్మికుల ప్రసన్నం కోసం ప్రయత్నిస్తున్నారు. ఎవరికి వారు విజయం కోసం వ్యూహరచన చేస్తున్నారు.


మహీంద్ర కర్మాగారం